## బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రత్యర్థులే లేరని నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాశ్‌గౌడ్ భారీ మెజార్టీతో గెలుపొంది చరిత్ర సృష్టించడం ఖాయమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలో 18వ డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలలో ఇంటింటికి తిరుగుతూ బీఆర్ఎస్ ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటువేసి ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజల పక్షాన నిలపడుతున్న నాయకుడికి ప్రతి ఒక్కరు మద్దతు ఇవ్వాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి ప్రజలకు సమస్యలు లేకుండా చేశారని పేర్కొన్నారు. ప్రజలు కూడా బీఆర్ఎస్ పార్టీతోనే ఉన్నామని హామీ ఇచ్చారని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాందాస్‌ముదిరాజ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారి చంద్రశేఖర్, శ్రీనాథ్‌రెడ్డి, పద్మవతి పాపయ్యయాదవ్, అస్లాంబిన్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు గోపాల్‌ముదిరాజ్, రజాక్, మల్లేష్‌యాదవ్, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రచారంలో బీఆర్ఎస్ జోరు



నార్సింగి ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

మణికొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అందరికంటే ముందే టికెట్‌ను దక్కించుకున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తరపున మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, బూత్ ఇన్‌చార్జ్‌లు ఎవరి వార్డుల్లో వారే ప్రచారం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించటంతో శుక్రవారం నుంచి అదే పద్ధతిలో వారి వార్డులలో ప్రచారం నిర్వహించారు. మణికొండ మున్సిపాలిటీ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, పార్టీ అన్ని విభాగాల నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, గౌలిదొడ్డిలో చైర్‌పర్సన్ రేఖాయాదగిరిలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం..**

మైలార్‌దేవ్‌పల్లి: ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రకాష్‌గౌడ్ యువసేన అధ్యక్షుడు రాముగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాటేదాన్, గణేష్‌నగర్, టీఎన్జీవోస్ కాలనీలలో విస్తృత స్థాయి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ పార్టీ మెనిఫెస్టోను ప్రజలకు ఇచ్చి వివరించారు. అనంతరం రాముగౌడ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం ప్రకాష్‌గౌడ్‌కు కంచుకోటగా ఆయన ఉన్నన్ని రోజులు గెలుస్తుంటాడని జోష్యం చెప్పారు. అభివృద్ధికి మారుపేరుగా ఆయన నిలుస్తారని అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జయప్రకాష్ పద్మశాలి, సోమ శ్రీనివాస్, అడికె అర్జున్, దత్తు తదితరులున్నారు.

## బీజేపీని గెలిపిస్తాం !



తోకలను అభినందిస్తున్న నార్సింగి మున్సిపాలిటీ నేతలు

మణికొండ: నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించేందుకు శాయశక్తులా కృషి చేస్తామని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బుచ్చిరెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ పార్టీ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఆయనకు టికెట్‌ను కేటాయించడంతో శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయనను కలిసి అభినందించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలవాల్సిన అవశ్యకతను ఇంటింటికి ప్రచారం చేసి ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. తమ మంచిరేవుల గ్రామంలో అత్యధిక మెజార్టీ వచ్చేలా పనిచేస్తామని పేర్కొన్నారు. నాయకులు కృష్ణ తదితరులున్నారు.

## తోకలకు అండగా ఉంటాం !



తోకల శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన మణికొండ నాయకులు, కార్యకర్తలు

మణికొండ: బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామని మణికొండ మున్సిపాలిటీ బీజేవైఎం, బీజేపీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్‌లకు చెందిన నాయకులు, యువకులు పేర్కొన్నారు. శుక్రవారం మైలార్‌దేవ్‌పల్లిలో ఆయనను కలిసి టికెట్ సాధించినందుకు అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ లక్ష్యాలను వివరించి ఓటు అడగాలని సూచించారు. నాయకులు శివకుమార్, సదానంద్‌తో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీకి అర్బన్ జిల్లా ప్రతినిధి రాజీనామా



రాజీనామా పత్రంతో తోకల సుధాకర్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: బీజేపీ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అనుచరుడు బీజేపీ పార్టీకి రాజీనామా చేశారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఒంటెద్దు పోకడలతో పార్టీ కార్యకర్తలు తీవ్ర నిరాశతో ఉన్నారని, రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ ప్రతినిధి తోకల సుధాకర్‌రెడ్డి తీవ్ర నిరాశతో బీజేపీకి రాజీనామా చేశారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. తోకల శ్రీనివాస్‌రెడ్డితో 2015 నుంచి తన వెన్నంటు ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేశానని, రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా గెలిపించేందుకు కృషి చేసినా గుర్తింపు లేకుండా పోయిందని వాపోయారు. బీజేపీ పార్టీలో అనేక మంది నిరాశతో ఉన్నారన్నారు. ఆయన తొందరపాటు నిర్ణయాలతో పార్టీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు గత కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉన్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడికి రాజీనామా లేఖను పంపిస్తున్నట్లు వివరించారు.

# అంధకారంలో కాలనీ

- 15 రోజులుగా వెలగని విద్యుత్ దీపాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ ఫోర్ట్ వ్యూ కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత 15 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో దాదాపు 25 వీధి దీపాలు గతంలో ఏర్పాటు చేశారని వెల్లడించారు. గత రెండు నెలలుగా వీధి దీపాలు ఒక్కొక్కటిగా వెలగడం లేదన్నారు. 15 రోజులుగా కాలనీలోని ఏ ఒక్క వీధిదీపం వెలగడం లేదని వాపోయారు.

**స్టాక్ లేదంటున్న అధికారులు..**

◆ ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులకు ప్రజలు తెలపగా.. వీధి దీపాల స్టాక్ లేదని, మరో రెండు నెలల తరువాత వస్తుందని బదులిస్తున్నారన్నారు. దీనిపై జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.



వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారంగా ఇలా..

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జైలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయబడిన తర్వాత కూడా వాహనాలు నడిపిన వారికి వాహనాలను ఇచ్చిన వాహనదారులపై రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.బోస్ కిరణ్ శుక్రవారం 15 మందిపై చార్జ్‌షీట్ నమోదు చేశారు. వీరందరిని రాజేంద్రనగర్‌లోని 3వ స్పెషల్ ఎంఎం కోర్టులో హాజరు పరచగా.. నిందితులకు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్ షా 8 మందికి జైలుశిక్ష విధించారు. వీరిలో 5 మందికి మూడ్రోజుల చొప్పున, ఇద్దరికి 5 రోజుల చొప్పున, ఒకరికి నాల్గు రోజుల జైలుశిక్ష పడిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. తిరిగి ఉల్లంఘనలకు పాల్పడితే 3 నెలల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారన్నారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించి పోలీసులకు పూర్తిగా సహకరించాలన్నారు.

## పారిశుద్ధ్యంపై అవగాహన



గంధంగూడలో అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర అన్నారు. కార్పొరేషన్ పరిధి గంధంగూడలోని జీఎస్ఎస్‌యూఆర్ఎం ఫేస్–1,2లో శానిటేషన్ స్పెషల్‌డ్రైవ్‌ను చేపట్టారు. రోడ్లను పూర్తిస్థాయిలో మట్టి లేకుండా స్వీపింగ్ చేయాలన్నారు. రోడ్ల వెంట ఉన్న చెత్తను తొలగించాలని, డోర్ టూ డోర్ చెత్తను వేరు చేసి సేకరించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు చెత్తను స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలన్నారు. రోడ్లకు ఇరువైపుల ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలను వేయొద్దన్నారు. రోడ్ల వెంట పడేసిన చెత్తతో అనారోగ్యాలకు కారణం కావొద్దని వారిని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు సుభాష్, జగన్, మల్లేష్, కృష్ణ, సురేష్, రాము, నరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రచార చిత్రాలు !

బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా నాయకులు కూరగాయలు అమ్ముతూ.. పాలు అమ్మడం, ఇస్త్రీలు చేయడం, కిరాణషాపులో అమ్మటం లాంటివి చేసి స్థానిక నేతలు ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు.

– మణికొండ



మణికొండలో కూరగాయలు అమ్మి ఓటు అడుగుతున్న రాష్ట్ర నాయకురాలు లక్ష్మిశ్రీ



మణికొండలో రచయిత అనంతశ్రీరాంను ఓటు అడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## త్వరిగతిన పనులు పూర్తి చేయాలి

శంషాబాద్ రూరల్ : తొండుపల్లి సమీపంలో బెంగళూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేస్తున్న ఫ్లైఓవర్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ కాంట్రాక్టరుకు సూచించారు. శుక్రవారం జేఈ రంజిత్‌తో కలిసి పనులను పరిశీలించారు. రోడ్డు పనులతో తరచూ ట్రాఫిక్‌జామ్, ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొన్నారు. పనులను వీలైనంతా వేగంగా పూర్తి చేయాలని సీఐ కోరారు. వారం రోజుల్లో రెండు వైపులా బీటీ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ హామీ ఇచ్చారని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పనులు పూర్తి చేయకుంటే ఇక్కడ జరిగే ప్రమాదాలకు కాంట్రాక్టరును బాధ్యున్ని చేస్తామని హెచ్చరించారు.

# మోడల్‌గా అభివృద్ధి చేస్తా !



కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌ముదిరాజ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టికెట్‌ను మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్‌ముదిరాజ్ సాధించారు. గత వారం రోజులుగా రోజూ వందలాది మంది వచ్చి ఆయనను అభినందించి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చి వెళ్తున్నారు. టికెట్ సాధించడంతో పాటు ఎన్నికల్లో గెలుపు దిశగా పయనించేందుకు ఆయన చేపట్టనున్న ప్రచారం, ఓటర్లను చేరే విధానం, గెలిస్తే నియోజకవర్గానికి చేసే అభివృద్ధిపై 'సాక్షి' ఆయన మనోగతాన్ని తెలుసుకుంది. ఆయన మాటల్లో..

**అభివృద్ధికి కేరాఫ్‌గా..**

◆ మణికొండ మున్సిపాలిటీలో ప్రజలకు అవసరమైన పార్కులు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, శ్మశానవాటికలు, మరుగుదొడ్లు, కమ్యూనిటీహాళ్లు, తాగునీటి సరఫరా పైపులైన్లు, క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేశాం. మణికొండలో చేసిన విధంగా రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తా.

◆ నియోజకవర్గంలో ప్రజలకు ఉన్న ప్రధాన సమస్యలపై ఇప్పటికే అవగాహన ఉంది. నియోజకవర్గానికి వంద పడకల ఆసుపత్రి, గండిపేట మండలం, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లకు జూనియర్ కళాశాలలు, నార్సింగి మున్సిపాలిటీలో క్రీడా మైదానం ఏర్పాటు చేయిస్తా.

◆ నియోజకవర్గంలో సొంత ఇళ్లులేని వారు చాలా మంది ఉన్నారు. వారందరికీ గూడు కల్పిస్తాను.

**నిధులను రాబడతా...**

◆ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వారికి అవసరమైన లింకురోడ్లు, రోడ్ల విస్తరణ, వంతెనలు, మరిన్ని పార్కుల అభివృద్ధికి అవసరమైన నిధులను రాబట్టేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తా. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయి, అత్యధిక సీట్లు గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడుతుంది.



నరేందర్‌ను సన్మానించిన వట్టినాగులపల్లి వాసులు

**గెలిపించాలని అభ్యర్థన..**

రాజేంద్రనగర్: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్తూ.. ఓటరును కలిసి కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ.. ఓటర్లను కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరారు. పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ 40 ఏళ్లుగా ప్రజాసేవలో ఉన్నారని, ఆయనకు ఈసారి అవకాశమిస్తే రాజేంద్రనగర్ నియోజకవర్గం రూపురేఖలను మారుస్తారని వివరించారు. కోరని బాల్‌రాజ్, కోరని శ్యామ్, లలిత్, ఖలేద్, రాధే శ్యామ్, శ్రీధర్, నారాయణ, నర్సింగ్‌రావు, ప్రకాశ్, కుమార్, సదానంద్, హరి, సాయికిరణ్, కిట్టు, భరత్‌రెడ్డి, ఉమామహేశ్వరి, అంశమ్మ, ఝాన్సీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వట్టినాగులపల్లిలో మెజార్టీ..**

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లిలో ఎమ్మెల్యే ఎన్నికల్లో ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్‌కే భారీ మెజార్టీ సాధిస్తామని మున్సిపాలిటీ పార్టీ కోశాధికారి ప్రదీప్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో పెద్దఎత్తున వట్టినాగులపల్లి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వట్టినాగులపల్లిలోని అన్ని పోలింగ్‌బూత్‌లలో ఈసారి మెజార్టీ తనకే వస్తుందని, దీనికి అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. నాయకులు అభిలాష్, బిక్షపతి, రాము, శివ, పాండులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేపీతోనే బీసీలకు రాజ్యాధికారం



ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జితేందర్

శంషాబాద్: బీజేపీ ప్రభుత్వంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని ఓబీసీ మోర్చా శంషాబాద్ అధ్యక్షుడు జితేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కేవలం ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయన్నారు. బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించిన బీజేపీయే బీసీల ఆత్మబంధువుగా ముందుకెళ్తుందన్నారు. బీసీ ప్రధానితో పాటు దేశ అత్యున్నత పదవిలో సైతం గిరిజన మహిళకు ఇచ్చిన ఏకైక పార్టీ బీజేపీయేనని కొనియాడారు. అశోక్, శీలంరవి, రాకేష్, కృష్ణ తదితరులున్నారు.

## బీజేపీలోకి టీడీపీ నేతల చేరిక

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ గాలీ వీస్తుందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తన నివాసంలో రాజేంద్రనగర్ డివిజన్ టీడీపీ వైస్ ప్రెసిడెంట్ సదాల శ్రీనివాస్‌రెడ్డి, శంషాబాద్ మండల షాపూర్ గ్రామం నుంచి యువకులు భారీ ఎత్తున బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా తోకల మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కమలం వికసిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నియోజకవర్గంలో యువత బీజేపీలో చేరేందుకు ముందుకొస్తున్నారన్నారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం తీసుకుంటున్న గోపి నాగమణి



వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో డీఈ శివశంకర్, అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను ఫిర్యాదు అందిన వెంటనే పరిష్కరిస్తున్నామని గగన్‌పహాడ్ విద్యుత్ రెవెన్యూ ఆఫీస్ అసిస్టెంట్ అకౌంట్ ఆఫీసర్ గోపి నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం విద్యుత్ వినియోగదారుల పరిష్కార దినోత్సవం సందర్భంగా శివరాంపల్లిలోని విద్యుత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులు అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ ఈశ్వరప్రసాద్‌తో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా అకౌంట్ ఆఫీసర్ నాగమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం కోట్లాది రూపాయలతో నాణ్యమైన విద్యుత్‌ను నిర్విరామంగా వినియోగదారులకు అందిస్తున్నారన్నారు. విద్యుత్ వినియోగదారులు కూడా సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించి సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. విద్యుత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: విద్యుత్ వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తామని ఇబ్రహింబాగ్ డీఈ శివశంకర్ అన్నారు. శుక్రవారం నార్సింగిలోని డీఈ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంతో పాటు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా చేసేందుకు తమ శాఖ ఉద్యోగులు నిర్విరామంగా కృషి చేస్తున్నారన్నారు. అప్పుడపుడు మీటర్లు పాడుకావడం, అధిక బిల్లులు రావటం లాంటి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామన్నారు. శుక్రవారం వారి దృష్టికి వచ్చిన కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఏడీఈ సాయినాథ్, ఏఏఓ రాజులతో పాటు అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## 'అభివృద్ధిని చూసే ఇతర నాయకుల చేరిక'



బీఆర్ఎస్ ప్రచార రథం ర్యాలీలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న అభివృద్ధి, సంక్షేమాలను చూసి వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రకాష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 5వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా హైదర్షాకోట్‌లోని కేంద్ర విహార్ ప్రాంతంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి సీఎం కేసీఆర్ అనేక విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకున్నారన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, రైతుబంధు, బీసీబంధు, మైనార్టీ బంధు, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్, షాదీముబారక్ తదితర పథకాలను అమలు చేశారన్నారు. పథకాలను ప్రారంభించి వాటిని విజయవంతంగా కొనసాగిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ పథకాలు లేవన్నారు. ప్రజలు, యువత వీటిని చూసి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్‌లో దాఖలు కాని నామినేషన్

రాజేంద్రనగర్: తొలిరోజు శుక్రవారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. నామినేషన్ వేసేందుకు ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్రులు నామినేషన్ ఫారాలు స్వీకరించారు. శుక్రవారం సాయంత్రానికి 30 మంది నామినేషన్ ఫారాలను స్వీకరించినట్లు ఆర్ఓ మల్లయ్య తెలిపారు. శుక్రవారం మంచి రోజు కావడంతో పలువురు నామినేషన్లు వేస్తారని భావించినప్పటికీ.. ఏ ఒక్క నామినేషన్ దాఖలు కాలేదు. నామినేషన్ కేంద్రాన్ని శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.



## ఆర్ఓ కార్యాలయం వద్ద ఐదంచెల భద్రత



గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు మాదాపూర్ డీసీపీ సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం శేరిలింగంపల్లి ఆర్ఓ కార్యాలయం, 100 మీటర్ల పరిధిలో చేసిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భగా డీసీపీ మాట్లాడుతూ రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి 100 మీటర్ల వరకు ఐదంచెల భద్రత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థులు ముందుగానే ఆర్ఓ అనుమతి తీసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారి సూచించే నిబంధనలను పక్కాగా అమలు చేస్తామని డీసీపీ వివరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలకు అనుమతి తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆర్ఓ కార్యాలయానికి ఎవరిని అనుమతించవద్దని ఆయన అధికారులను ఆదేశించారు. పోలీసులకు కూడా ఆర్ఓ కార్యాలయం లోపలికి వెళ్లే అనుమతి లేదని తెలిపారు. ఆర్ఓ చాంబర్ ద్వారం వరకు మాత్రమే పోలీసులు వెళ్లే అవకాశం ఉందన్నారు.

## తాగిన మత్తులో దాడికి యత్నం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్: రాత్రిపూట రోడ్డుపై అడ్డుగా కారును నిలపడంతో పాటు తాగిన మత్తులో దాడికి యత్నించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్కారం గ్రామానికి చెందిన కొత్త మాధవరెడ్డి గురువారం రాత్రి శంషాబాద్ నుంచి కారులో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని రోడ్డులో స్థానికులు కావలి కృష్ణ అలియాస్ కన్న, నీరటి రాజు కారును ఆపారు. అటుగా వెళ్తున్న మాధవరెడ్డి కారుకు అడ్డుగా ఉన్న కారును పక్కకు తీయాలని వీరిని కోరాడు. దీంతో వీరిద్దరు తాగిన మత్తులో అతడిపై దాడికి యత్నించడంతో పాటు బూతులు తిట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.